ఐసీడీఎస్‌లో బదిలీలు

హనుమకొండ, ఆగస్టు 1 : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగులను బదిలీ చేశాయి. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారి మధురిమ నర్సంపేటకు బదిలీ అయ్యారు. అలాగే పరకాల ఏసీడీపీవో స్వర్ణలత మేడ్చల్ ఏసీడీపీవోగా, పరకాల సీడీపీవో భాగ్యలక్ష్మి హనుమకొండ సర్వీస్ హోమ్‌కు, వరంగల్ సీడీపీవో విశ్వజను హనుమకొండ అర్బన్ ప్రాజెక్టు సీడీపీవోగా, ములుగు జిల్లా ఏటూరునాగారం సీడీపీవో కందుల స్వాతికి పరకాల ప్రాజెక్టు సీడీపీవోగా పోస్టింగ్ ఇచ్చారు. కాగా, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏసీడీపీవో భాగ్యలక్ష్మిని పరకాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

4న టీటీసీ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 1 : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు(టీటీసీ) థియరీ పరీక్ష ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ భువనేశ్వరి తెలిపారు. ఉదయం 11 నుంచి 1 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, 3.30 నుంచి 4.30 గంటల వరకు లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో (డ్రాయింగ్), ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లోని (టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ) పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

రెండో రోజూ దీక్ష

హనుమకొండ, ఆగస్టు 1 : డబుల్ బెడ్ రూంల్ వెంటనే కేటాయించాలని బాలసముద్రంలోని అంబేద్కర్‌నగర్, జితేందర్ సింగ్ నగర్ కాలనీల లబ్ధిదారులు చేపట్టిన దీక్ష గురువారంకు రెండో రోజుకు చేరుకుంది. హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపడుతున్న దీక్షలకు పలు సంఘాల నాయకులు తమ సంఘీభావం తెలిపారు. దీక్షలో సౌరం రఘు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై శిక్షణ

హనుమకొండ, ఆగస్టు 1 : త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి సెక్రటరీ అశోక్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. ప్రతి జిల్లా నుంచి ఐదు గురు కంప్యూటర్ ఆపరేటర్లకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో శిక్షణ ఉంటుందన్నారు. మిగిలిన వారికి జిల్లా కేంద్రంలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

పరకాల : పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎల్కతుర్తి : రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేలేరు : సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేలేరు : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

మహిళ లకు సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం
- కాళోజీ సెంటర్‌లో నిరసన.. దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ, ఆగస్టు 1 : సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం నక్కల గుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం డౌన్ డౌన్, మహిళలకు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేస్తూ అరగంట సేపు రోడ్డుపై బైఠాయించారు. కాగా, దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో మహిళా కార్యకర్తకు గాయం అయింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఇతర మహిళలపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సీఎం స్థాయిని మరిచి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం చాతకాక బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దాడులకు పాల్పడుతూ, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 6 గ్యారెంటీలు, 13 హామీలు, 420 మ్యానిఫెస్టో హామీల అమలుకు ప్రజల తరపున కొట్లాడుతూనే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. సబితా ఇంద్రారెడ్డిపై చేసిన బస్టాండ్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకే వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు నల్లా స్వరూపారాణి, సంకు నర్సింగ్, ఇమ్మడి రాజు–లోహిత, సోదాకిరణ్, బోయినపల్లి రంజిత్‌రావు, చెన్నం మధు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్,

కాళోజీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మహిళలు

మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, సీనియర్ నాయకులు నయీమొద్దీన్, రామ్మూర్తి, బుద్ధె వెంకన్న, రాకేశ్‌యాదవ్, రజిత, జ్యోతి, బండి రజనీకాంత్, కమరున్నీసా, పరశురాములు, లలిత పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఎల్కతుర్తి : అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ మహిళా సభ్యులతో అమర్యాదగా మాట్లాడడాన్ని నిరసిస్తూ గురువారం ఎల్కతుర్తి బస్టాండ్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు కడారి రాజు, తంగెడ మహేందర్, గొల్లె మహేందర్, తంగెడ నగేశ్, చదిరం నాగేశ్వర్, చెవుల కొమురయ్య, హింగె శివాజీ, దేవేందర్‌రావు, వెంకటేశ్‌యాదవ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, చిట్టిగౌడ్, గొడిశాల వినయ్, మదార్, సాంబమూర్తి పాల్గొన్నారు.

వేలేరు : అసెంబ్లీలో సీఎం మహిళల ఆత్మగౌరవాన్ని కించపర్చేలా మాట్లాడడం సిగ్గు చేటని మండలాధ్యక్షుడు మరిజె నర్సింహారావు అన్నారు. వేలేరులో మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చాడ సరితా రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కాయిత మాధవరెడ్డి, జానీ, ఇట్టబోయిన భూపతిరాజ్, సంపత్, యూత్ మండలాధ్యక్షుడు గొవింద సురేశ్, కొయ్యడ మహేందర్, సూత్రపు సంపత్, కిరణ్‌పాల్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాయంపేట : సీఎం మహిళలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. ఎమ్మెల్యే పైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తే సామాన్య ప్రజలను ఎలా గౌరవిస్తారని మండిపడ్డారు. తెలంగాణలో రాక్షస పాలన నడుస్తున్నదని, పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేద్దామంటే పోలీసులు పహారా కాస్తున్నారని ఇలా ఎంత కాలం చేస్తారని ప్రశ్నించారు.

పరకాల : పరకాలలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ పట్టణ కమిటీ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి మాట్లాడుతూ తెలంగాణలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం ఉందని, కానీ రేవంత్‌రెడ్డికి కనీస మర్యాద లేదని విమర్శించారు. నాయకులు బండి సారంగపాణి, పంచగిరి శ్రీనివాస్, దుంపేటి నాగరాజు, శ్రావణి, సాంబరాజు జ్యోతి పాల్గొన్నారు.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలి

హనుమకొండ, ఆగస్టు 1 : అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మధురిమ, అదనపు డీఎంహెచ్‌వో మదన్ మోహన్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఇక్తెదార్ అహ్మద్, డెమో అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

ఈ నెల 5న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి 9 వరకు కొనసాగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు శనివారంలోగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, వివరాలు అందజేయాలని ఆదేశించారు. జీపీ స్థాయిలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, యువతతో టీం ఏర్పాటు చేయాలని డీపీవోకు సూచించారు. మున్సిపల్ స్థాయిలో వార్డు ప్రత్యేకాధికారి, వార్డు అధికారి, మెప్మా రిసోర్స్ పర్సన్లు, కౌన్సిలర్‌తో టీం ఏర్పాటు చేయాలని గ్రేటర్ కమిషనర్, పరకాల మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. కుక్కల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. జీపీలు, మున్సిపాలిటీల్లో మురుగునీటి నిల్వలున్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీవో నాగ పద్మజ, జడ్పీ సీఈవో విద్యాలత పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

డిస్నీల్యాండ్‌లో ఘనంగా ఉద్యోగ విరమణ సభ

సదయ్య, లక్ష్మీనివాసాన్ని సన్మానిస్తున్న జబర్దస్త్ ఫేం వెంకీ మంకీ, ఉద్యోగులు

దామెర, ఆగస్టు 1 : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, జీవితం సన్మార్గంలో పయనించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి మరువలేనిదని జబర్దస్త్ ఫేం వెంకీ, ఉపాధ్యాయులు, మేధావులు అన్నారు. గురువారం ఓగులాపురం శివారులోని డిస్నీల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, స్కూల్ ముఖ్య సలహాదారులు దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం ఉద్యోగ విరమణ ఆత్మీయ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడం కోసం ఎంతో కృషి చేశారన్నారు. వారు స్వయంగా పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ముఖ్య సలహాదారుడు దయ్యాల మల్లయ్య, కరస్పాండెంట్ దయ్యాల శోభారాణి, డైరెక్టర్లు రాకేశ్‌భాను, దినేశ్‌చందర్ పాల్గొన్నారు.

ట్రెజరీ డీడీ బాధ్యతల స్వీకరణ

శ్రీనివాస్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీజీవోలు

హనుమకొండ, ఆగస్టు 1: జిల్లా ట్రెజరీ డీడీగా ఆకవరపు శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్‌కు కార్యాలయ సిబ్బందితో పాటు టీజీవోలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఈగ వెంకటేశ్వర్లు, నాగనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు కిరణ్ కుమార్, కోల రాజేశ్ కుమార్, అన్వర్ హుస్సేన్, చంద్రశేఖర్, రవీంద్ర, రాజేశ్‌కుమార్, రవి ప్రసాద్, శ్రీనివాసులు, ఈశ్వర ప్రసాద్ ఉన్నారు.

'కాంగ్రెస్ పార్టీ బీసీలకు ద్రోహం చేసింది'

మడికొండ ఆగస్టు 1 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో బీసీలకు సంవత్సరానికి రూ.20వేల కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నిధులు కేటాయించకుండా ద్రోహం చేసిందని బీసీ ప్రజా సంఘాల జాక్ చైర్మన్ కోల జనార్దన్ ఆరోపించారు. కాజీపేట మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, బీసీలకు అసెంబ్లీలో 34 సీట్లకు తగ్గకుండా ప్రాతినిధ్యం కల్పిస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని, జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సాధినేని సుధాకర్, మాచర్ల శరత్‌చంద్ర, గొల్లపల్లి వీరస్వామి, తాడిశెట్టి క్రాంతికుమార్, కనకరాజు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎల్కతుర్తి, ఆగస్టు 1 : ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవం సందర్భంగా ఎల్కతుర్తిలో ఆటో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఫైనాన్స్ కట్టలేక, కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో కార్మికులకు నెలకు రూ.12వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు లోకిని తిరుపతి, నాయకులు అంచనగిరి రవి, అంబాల సుమన్, వెంకటేశ్‌యాదవ్, కోరె రాజ్‌కుమార్, అయిత సంపత్, హింగె రమేశ్, కుమార్, స్వామి, అంబాల చేరాలు, సంజీవ్, కడారి లక్ష్మణ్, గొర్రె సునీల్ పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ..

ఆత్మకూరు : ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం సందర్భంగా గూడెప్పాడ్, ఆత్మకూరు గ్రామాలకు చెందిన న్యూ భగత్, రత్నమాల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్వీటు పంపిణీ చేశారు. ఆటో కార్మికులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నిరంతర అభ్యసనతో అభివృద్ధి'

మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 1 : నిరంతర అభ్యసనతో అభివృద్ధి సాధ్యమని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. గణితశాస్త్ర విభాగ సెమినార్ హాల్‌లో గురువారం కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో విద్యార్థులు, బోధనేతర ఉద్యోగులకు 'స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' 'కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్'ను ప్రారంభించారు. నూతన విషయాలను నేర్చుకుంటూ, ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలన్నారు. విద్యార్థులు నూతన అంశాలపై పట్టు సాధించాలన్నారు. సెల్ట్ సంచాలకుడు మేఘనారావు మాట్లాడుతూ విద్యార్థులకు 40 రోజుల పాటు శిక్షణ, అసైన్‌మెంట్లు ఉంటాయన్నారు. ఇంగ్లిష్ విభాగాధిపతి దీపాజ్యోతి, గణితశాస్త్ర విభాగాధిపతి భారవీశర్మ, రవీందర్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి..

అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని నూతన సెక్యూరిటీ సిబ్బందికి కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి కొత్తగా విధులు చేపడుతున్న సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లతో క్రీడా మైదానంలో మాట్లాడారు. యూనివర్సిటీలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, ఇతరులు ప్రవేశించకుండా, అవసరమున్నవారికి సహకరిస్తూ, సేవాగుణంతో పని చేయాలన్నారు. ప్రస్తుత అవసరాల మేరకు మహిళా గార్డులను కూడా నియమించినట్లు చెప్పారు. వ్యాయామ కాలేజీ ప్రిన్సిపాల్ ఏటీబీటీ ప్రసాద్, సహాయ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్, వల్లాల పృథ్వీరాజ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సెక్యూరిటీ ఆఫీసర్ దేవదాస్ ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సీపీ

హసన్‌పర్తి, ఆగస్టు 1 : యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా విద్యార్థులకు సూచించారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్‌లో గంజాయి, మత్తు పదార్థాలపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్షణికానందం కోసం మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేక పోతున్నారన్నారు. మత్తు పదార్థాలు సేవిస్తున్నా, విక్రయించినా 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం ప్రభుత్వం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి ఏసీపీ జితేందర్‌రెడ్డి, నార్కోటిక్స్ ఏసీపీ సైదులు, కిట్స్ ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, సీఐలు సంజీవ్, సరోత్తం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేద్దాం..

సుబేదారి : రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం సమన్వయంతో పనిచేద్దామని సీపీ అధికారులకు సూచించారు. గురువారం కమిషనరేట్‌లో సమావేశం నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే హాజరయ్యారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ సమస్యలు, నియంత్రణ చర్యలపై వివరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ రోడ్లపై పనిచేయని విద్యుత్ స్తంభాలు తొలగించాలని, వ్యాపారులు రోడ్లపై ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులను తీసివేయించాలని, సెల్లార్‌లో వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, డీటీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సీపీ, కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ హనుమకొండ అశోకా జంక్షన్, అదాలత్ జంక్షన్‌లోని ట్రాఫిక్ సిగ్నల్స్‌పై ఉన్న తీగలను పరిశీలించారు.

హనుమకొండ డీఎంహెచ్‌వో పోస్టింగ్‌పై అనిశ్చితి

డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు రిలీవ్

వరంగల్, ఆగస్టు 1 : హనుమకొండ డీఎంహెచ్‌వో పోస్టింగ్‌పై అనిశ్చితి నెలకొంది. డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సాంబశివరావు వరంగల్ డీఎంహెచ్‌వోగా బదిలీ కాగా, గురువారం రిలీవ్ అయ్యారు. హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య ములుగు డీఎంహెచ్‌వోగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఆయన తిరిగి హనుమకొండ డీఎంహెచ్‌వోగా రావడానికి విముఖత చూపుతున్నట్లు సమాచారం. అయితే, హనుమకొండ జిల్లాకు ఎవరికైనా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా? లేదా డిప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్ అప్పయ్యకు రప్పిస్తారా అనేది తేలాల్సి ఉంది.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 1 : తల్లి మందలించిందని మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట కందిగడ్డతండాకు చెందిన సహదేవుడా బాబు కొంతకాలంగా తన కుటుంబం సహా భీమారం ప్రాంతానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత నెల 29న అతడి కుమార్తె స్రవంతి(19) ఇంట్లో ఉన్న రూ.వెయ్యి ఖర్చు చేసింది. ఆ విషయం ఆమె తల్లి సరోజనకు తెలిసి స్రవంతిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన స్రవంతి ఇంట్లో ఉన్న క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఏకశిల దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ప్రశాంత్‌నగర్‌కు చెందిన సయ్యద్ అలీ (40) జూలై 27న నిట్ సమీపంలో బైక్‌తో రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొట్టింది. స్థానికులు, కుటుంబ సభ్యులు నగరంలోని ప్రైవేట్ దవఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ అతడు మరణించాడు. కుమారుడు ఇదిరిస్ ఫిర్యాదు మేరకు ఎస్సై లవన్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 1 : జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు శనివారం జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సారంగపాణి తెలిపారు. పాల్గొనే వారు బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 9390104499 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మొక్కల పంపిణీ

పరకాల, ఆగస్టు 1 : వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు.

సెప్టెంబర్ 9న నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- మేయర్, కుడా చైర్మన్, కలెక్టర్, గ్రేటర్ కమిషనర్‌తో కలిసి పనుల పరిశీలన


నయీంనగర్ బ్రిడ్జి, నాలా మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 1 : నయీంనగర్ బ్రిడ్జి(పెద్ద మోరీ) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సెప్టెంబర్ 9న బ్రిడ్జి ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు. బ్రిడ్జి పనులతో పాటు పాదరక్షకుల మార్గం, మోరీ పనులను కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని చెప్పారు. టీపీసీసీ కార్యదర్శి బట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, తోట వెంకన్న, మానస–రాంప్రసాద్, నాయిని లక్ష్మారెడ్డి, రహీమున్నీసా బేగం పాల్గొన్నారు. కాగా, హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్, కాజీపేట మండలాలకు సంబంధించిన 114 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు త్వరగా పూర్తి చేయాలి..

హనుమకొండ : కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదేశించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, రా